# సన్మానం

ఆదిరెడ్డి మావుళ్ళు

“ఒరేయ్ చిన్నా... యిక భరించలేనారా యీ చలిని... రాత్రిళ్ళు ఎముకల్ని కొరికే చలి... నిద్రపట్టక ఛస్తున్నాను... వచ్చేటప్పుడో దుప్పటి కొని పట్టుకొని రారా చిన్నా...”

సాయంత్రం అలా బజార్లోకి బయలుదేర్తుండగా తండ్రి అన్న మాటలు పదేపదే రఘుకి తెలీకుండానే వినబడ్తున్నాయి.

రోడ్డుమీద అప్రయత్నంగా అడుగులు వేస్తున్నాడే గాని రఘు మనసు మనసులో లేదు.

ఈ మధ్య యింట్లో ఒక్క క్షణం కూడా వుండలేకపోతున్నాడు. ఒకపక్క ఆ ముసలి వాని గొణుగుడు. అవీ యివీ కావాలంటూ మనుషుల్ని ఊపిరి కూడా తియ్యనీకుండా ప్రాణాలు తోడేస్తాడు చాదస్తంతో.

సీత వుంటే తనకీ పాట్లుండేవి కావు. అప్పుడప్పుడు “అదేవిటండీ అలా చిరాకుపడతారు... మీలా తిరగ్గలిగే స్థితిలోవుంటే మీ సహాయం కోరేవారా ఆయన! వృద్ధాప్యంలో వున్నారు... కాస్తంత చేయూతనివ్వడం పోయి...” అంటూ వున్నా అన్ని సేవలూ తనే చేసేసేది.

మొన్ననే “నాన్నా అమ్మను చూడా”లంటే తేజను కూడా వూర్లోదింపి వచ్చేశాడు తను.

నిజానికి తండ్రి ఆర్థికంగా తనకేమాత్రమూ బరువుకాడు. ఎటొచ్చి ఆయన మాటలు, గొంతెమ్మ కోర్కెలు తీర్చే నిమిత్తం అటు యిటూ తిరగలేక ఛస్తున్నాడు. అదంటే యిది యిదంటే అది... ఆయన్ని సంతృప్తి పర్చడం తనకు మాత్రం చేతగావడంలేదు. పైగా ఖళ్ ఖళ్మని దగ్గులు - ఇంగ్లీషు మందులు ఒంటికి మంచివి కావంటూనే రోగాన్ని సమకూర్చుకుంటాడు. ఎదుటివారి మాటలు అసలు చెవిని పడవు. కాదంటే కొరకొర చూపులు. తను వేగలేడా ముసలి వ్యక్తితో.

ఆఫీసుకు సెలవు కావడంతో వుదయం నుంచి యింట్లోనే గడిపిన రఘుకి సాయంత్రపు చల్లని గాలులు ఉల్లాసాన్నిస్తున్నాయి. తేలికపడ్డ మనసుతో అడుగులు ముందుకు సాగిస్తున్నాడు తండ్రిని గూర్చి ఆలోచిస్తూ.

పోలయ్యగారు శతాధిక వృద్ధులు. ఆయన ఆంగ్లేయులు పరిపాలించే రోజుల్లో మాస్టారు వుద్యోగం చేసి మాస్టారుగానే రిటైరయ్యారు. ఆ తర్వాత శేషజీవితాన్ని పెద్దపెద్ద ఉగ్రవాదులు, సమరయోధుల వెంట తిరిగి స్వాతంత్ర్యసిద్ధి కోసం పాటుపడ్డారు.

అనేకసార్లు జైల్లోకి వెళ్ళారుకూడా.

పోలయ్యగారికి నలుగురు సంతానం. భార్య పోయేక పెద్దకొడుకు సంరక్షణలో కొన్నాళ్ళు, రెండో కొడుకు దగ్గర కొన్నాళ్ళు గడిపేక, కోడళ్ళ గయ్యాళితనం మూలంగా వాళ్ళల్లో వాళ్ళే కాట్లాడుకుంటే వుండలేక మూడో కొడుకు దగ్గర మకాం పెట్టేరు. అక్కడా ఎన్నాళ్ళోగాని వుండలేకపోయేరు.

“మీలో మీరే కాట్లాడుకోవడం దేనికి నాన్నింక నా దగ్గఱే వుంటారు... మీరేం చూడనక్కర్లేదని దెబ్బలాడిమరీ తండ్రిని తీసికొచ్చి యింట్లో పెట్టుకున్నాడు చిన్నకొడుకు రఘు.

మొదట్లో కాస్తంత సర్దుకుపోయినా రాను రాను రఘు తీసికొచ్చి నెత్తిన పెట్టుకున్నందుకు లోలోపల కించిత్తు బాధపడ్డాడు. అయినా అంతా భార్యే చూసుకుంటుంటే మధ్యలో తనకేం అనుకున్నాడు.

గవర్నమెంటిచ్చే పెన్షన్ డబ్బులు ఆయన కలా సరిపోతాయి. చిన్నచిన్న అత్యవసర సమయాల్లో మినహా మిగతావి యితరుల సొమ్ముల్తో కొనిచ్చినా పుచ్చుకోడు.

ఏదైనా స్వయంకృతంగా వుండాలని అతని పట్టుదల. అతని తత్వాల్ని మనస్తత్వ పరిణామాల్ని తట్టుకోగల మనోధైర్యానికి ఆయన భార్య తరవాత సీతనే చెప్పవచ్చు.

నెలలు నిండి పుట్టింటికి పోయిన సీతలేమి పోలయ్యగారికి తీరనిలోటే అయ్యింది. ముచ్చటగా కబుర్లు చెప్పేందుకు తేజ కూడా లేక పోయింది యింట్లో.

ఊసుపోని సమయాల్లో పక్కనే చెక్కబల్ల మీదున్న భగవద్గీత పారాయణాన్ని తర్కించుకుంటాడు. అదీ రఘు వుంటే జరగదు. ఆ శ్లోకాలకు భావ ప్రతిపదార్థాలకు చిరాకుపడ్తాడు. తనలో తానే వల్లించుకునే అలవాటు పోలయ్యగారికి లేదాయె.

పోనీ వాడితోనే కాస్త చర్చా కార్యక్రమాల్ని మొదలుపెడదామంటే తను నోరు విప్పితేచాలు కస్సుబుస్సుమంటాడు.

వాడు పెరగకముందే నయం. తన దగ్గరకు చేరి మరీ నాన్నచేత కథలు-కబుర్లు చెప్పించుకుని శ్రద్ధగా వినేవాడు.

ఒక్కోసారి పోలయ్యగారికి ఏడుపు కూడా వచ్చేది. తనను మరీ యింత చులకనగా పనికి రానివాడిగా చూస్తున్నందుకు. గుండెలు మీదెత్తుకుని మరీ ఆడించి పాడించేడు తను. అందుకు ఉద్ధరిస్తారన్న ఆశపోయి కన్న తండ్రిన్న మమకారం కూడా ఏకోశానా లేకపోయింది కొడుకులికి. ఆ విషయంలో మిగతావాళ్ళకంటె రఘు నయమే అనిపించినా ఎందుకో ఒక్కోసారి వాడి ప్రవర్తన ఆయన్ని తీరని మనోవేదనకి గురిచేసేది.

***

సాయం సమయపు చీకట్లు అప్పుడే కమ్ముకోనేలేదు. పశ్చిమాన సూర్యుడు విపత్కర పరిణామాల్ని ఎదుర్కొనే ధైర్యం చాలక భయపడి దాక్కుంటున్నాడు.

“ఇప్పుడు శతాధిక వృద్ధులు, ప్రముఖ స్వాతంత్ర్యయోధులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, సంఘసేవాపరాయణులైన శ్రీ శ్రీరంగరాజులు

గార్కి 'దీనజనోద్ధరణ'అను బిరుదునిచ్చి సన్మానించే శుభ సందర్భాన్ని పురస్కరించుకొని వారి సేవలను, ప్రజ్ఞలను గూర్చి మన జిల్లా కలెక్టరు గారు విపులంగా వివరించి మీకుతెలియజేస్తారు.''

సన్మాన సభ అధ్యక్షులవారి మాటలు మైకు నుండి గంభీరంగా వినిపించడంతో ప్రేక్షకుల్లో నిశ్శబ్దం ఆవరించుకుంది. అందరి చూపులు వేదికవైపు కేంద్రీకృతమైనాయి.

సన్మానితుడ్ని చూడగానే రఘు మనసులో ఏదో తళుక్కుమని అంతలోనే మాయమైనట్టనిపించింది.

అనంత జనావళిని చీల్చుకుని పరిశీలనగా చూసేడు. రంగరాజులు...

** ** ** **

''పోలయ్య మాస్టారంటే మీరేనా...?!

ఇంటి వసారా ముందు సాయంత్రం పిల్లలకి పాఠాలు నేర్పుతున్న పోలయ్య మాస్టారు ఆ వొచ్చిన వ్యక్తులకేసి అవునన్నట్లు చూసేరు- ఆశ్చర్యంగా.

''మిమ్మల్ని రంగరాజులుగారు పిల్చుకు రమ్మన్నారు.

''నన్నా...? ఎందుకు?!''

''పని చేస్కోవలసిన పిల్లల్ని పాడు చేస్తున్నందుకు.''

''చదువు చెప్పడం పాడుచెయ్యడమా?''

''కాదు—వాళ్ళ తల్లితండ్రుల పొట్టలు కొట్టడం... వాళ్ళకు తిండెవరు పెడ్తారు...?!''


''సరే! వస్తాను పదండి.'' వాళ్ళతో వాదించడం అనవసరం అని పోలయ్య మాస్టారు అన్నారు.

''లేదండి! దగ్గరుండి స్వయంగా తీసుకు రమ్మన్నారు'' ఆ వచ్చిన వ్యక్తులు నిక్కచ్చిగా చెప్పేరు పోలయ్య మాస్టారుతో.

అంతా అగమ్యగోచరంగా చూస్తున్న పిల్లలు మొదటిసారిగా తమ మాస్టారి ముఖంలో కొత్త ముఖకవళికల్ని కనిపెడ్తున్నారు. ఇక ఏడేళ్ళ రఘు విషయం చెప్పనవసరంలేదు.

వెంట వెళ్తున్న తండ్రిని పరీక్షగా చూస్తూ నిలబడిపోయేడు. ఆ క్షణంలో నాన్న చెప్పే కథల్లోని వీరుడిలా వాళ్ళపైదూకి చంపేయాలన్నంత ఉక్రోషం, కోపం కలిగిందా పసివాడి హృదయంలో.

రంగరాజుల్ని కలిసిన పోలయ్య మళ్ళీయింటికి తిరిగి మూడ్రోజుల్దాకరాలేదు. తన కాంట్రాక్టు పనికి ఆటంకంగా వున్న పోలయ్యమీద అక్కస్సు కొద్దీ తెల్లవారితో చేతులు కలిపి జైల్లో పెట్టించేడు.



ఇంట్లో భార్యాపిల్లలు భోరున ఏడ్చేరు.

జైలునుంచొచ్చిన పోలయ్యని ఎందుకొచ్చిన తగాదాలని భార్య వారించింది. ససేమిరా పోలయ్య వినలేదు.

తత్ఫలితంగా అనేకసార్లు జైలుపాలయ్యేడు.

దేశానికి వెన్నుముకలాంటి పిల్లల భవిష్యత్తుని బాగుపర్చే నిమిత్తం దేవుడ్నికూడా ఎదిరించే విధంగా వీరకంకణం కట్టుకున్నాడు పోలయ్య మాస్టారు.

సన్మానాన్ని తిలకిస్తున్న ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో రంగరాజులుగారికి జయజయ ధ్వానాలు పలికేరు.

ఏదో కర్తవ్యం స్ఫురణకొచ్చిన రఘు ఇంక అక్కడ ఒక్క క్షణం వుండలేక బయటికొచ్చేసేడు.

** ** ** **

''ఇదేమిట్రా చిన్నా... దళసరి ఖాదీ దుప్పటి పట్టుకురాక యిది తీసికొచ్చేవు...?''

''వుండండి నాన్నా! కాశ్మీరు శాలువ... చలి బాగా కాస్తుంది...!'' ఉద్వేగంతో వేడెక్కిన మనసుని తృప్తిపడ్డ చూపుల్తో చల్లార్చుకుంటూ అన్నాడు రఘు.

అంకితం

సహృదయులు, సాహితీ ప్రియులు డా॥ కాటికుప్పల సూర్యారావు గార్కి, ఆప్తమిత్రుడు మూర్తికి ప్రేమతో

—రచయిత